ఈనాడు
బాపట్ల
సోమవారం అక్టోబరు 14, 2024

బాలికపై అసభ్య ప్రవర్తన..
నిందితుడిపై పోక్సో కేసు

కర్లపాలెం, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని ఓ చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో పేరలి పంచాయతీలో ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలిక శనివారం సాయంత్రం ఇంటి సమీపంలో కుళాయి వద్ద నీరు పడుతుండగా అదే గ్రామానికి చెందిన 50ఏళ్ల వయసున్న పెరుమళ్ల భాగ్యారావు బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పగా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీంద్ర తెలిపారు.

ఆయువు విడిచి.. చిరంజీవిగా నిలిచి..

బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవాలు దానం


శ్రీనివాసరావు (పాతచిత్రం)

నిజాంపట్నం, తాడేపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో కుటుంబ యజమాని బ్రెయిన్ డెడ్‌కు గురవడంతో వారంతా అంతులేని దుఃఖంలో మునిగిపోయారు. ఆ బాధను దిగమింగుతూ ఆ వ్యక్తి అవయవాలు దానం చేసేందుకు అంగీకరించి మానవత్వం చాటారు. ఆ నిర్ణయం మరో నలుగురి ప్రాణాలు నిలిపింది. వివరాల్లోకెళితే.. బాపట్ల జిల్లా నిజాంపట్నానికి చెందిన మత్స్యకారుడు చెన్ను శ్రీనివాసరావు(48) ఈ నెల 11వ తేదీన ద్విచక్ర వాహనంపై కృష్ణాజిల్లా మచిలీపట్నం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మోపిదేవి సమీపంలో కొక్కిలిగడ్డ వద్ద ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు గుంటూరు జిల్లా తాడేపల్లి మణిపాల్ వైద్యశాల్లో చేర్చారు. వైద్యులు శ్రమించినప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో వైద్య పరీక్షల అనంతరం ఆదివారం బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. శ్రీనివాసరావు అవయవాలను దానం చేసేందుకు భార్య విజయలక్ష్మి, కుమారులు సురేష్, సుబ్రహ్మణ్యం అంగీకారం తెలిపారు. దీంతో ఏపీ జీవన్‌దాన్ ఛైర్మన్ డాక్టర్ రాంబాబు, మణిపాల్ వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి నేతృత్వంలో మణిపాల్ వైద్యశాలకు కాలేయం, రెండు కిడ్నీలు, కళ్లను డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాలకు అందించారు. కాగా, శ్రీనివాసరావు మృతదేహానికి ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కాలువ గట్టు.. పడవపై వెళ్లేట్టు!



ఈ చిత్రంలో గేదె కాలువలో ఉంది అనుకుంటే పొరబడినట్లే.. అది ఉన్నది కాలువ గట్టుపై ఉన్న నీటిలో.. పమిడిపాడు మేజర్ నుంచి తమ్మవరం వరకు పొలాలకు నీరు అందించేందుకు గతంలో కాలువ తవ్వారు. దీనిపై అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం సమీపంలోని సాగర్ కాలువ గట్టు పూర్తిగా పాడైపోయింది. వర్షం పడితే గుంతల్లో నీరు నిలుస్తోంది. ఈ దారిలో ఎక్కువ మంది రైతులు, అనమనమూరు ముంపు గ్రామానికి చెందిన ప్రజలు వెళ్తుంటారు. వర్షం పడితే గట్టు కాలువలా మారిపోతోంది. గత ప్రభుత్వం అయిదేళ్లలో కాలువ గట్టుపై తట్టెడు మట్టి పోయలేదని కర్షకులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తిచేస్తున్నారు. - న్యూస్‌టుడే, మేదరమెట్ల

వ్యాయామానికి సమయం కేటాయిస్తేనే ఆరోగ్యం

గుంటూరు: 'హెల్త్ ఇండియా.. హ్యాపీ ఇండియా' నినాదం ప్రతి ఒక్కరూ పాటించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో 'ఇండియా పోస్ట్ రన్-2024' కార్యక్రమాన్ని గుంటూరులో ఆదివారం నిర్వహించారు. మహిళలు, పురుషులకు 10కె, 5కె, 3కె రన్ నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి పెమ్మసాని నగదు బహుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించారు. పెమ్మసాని మాట్లాడుతూ 'చిన్నతనం నుంచే పిల్లలకు వ్యాయామం, నడక, ఆటలు తప్పనిసరి చేయాలి. వృత్తి, వ్యాపార పరంగా ఎంత తీరిక లేకున్నా వ్యాయామానికి సమయం కేటాయిస్తేనే ఆరోగ్యంగా ఉంటాం'.. అని పేర్కొన్నారు.



దుకాణం తెరిచేదెవరో..

ఈనాడు - బాపట్ల, న్యూస్‌టుడే - బాపట్ల, చీరాల అర్బన్

ఎక్సైజ్ స్టేషన్ల వారీగా మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు

ఎక్సైజ్ స్టేషన్	మద్యం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు
రేపల్లె	12	140
నగరం	12	179
అద్దంకి	23	362
వేమూరు	12	199
చీరాల	24	452
బాపట్ల	19	368
పర్చూరు	15	448

✦ ప్రైవేటు మద్యం షాపుల నిర్వహణకు లాటరీ నేడు
✦ ఇంకొల్లు దుకాణానికి అత్యధికంగా 47 దరఖాస్తులు
✦ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు.. వైద్యులు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణకు సోమవారం లాటరీ ప్రక్రియ ద్వారా లైసెన్సుదారుల ఎంపికకు జిల్లాలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని 117 మద్యం దుకాణాలకు రెండేళ్ల కాలపరిమితితో లైసెన్స్ జారీకి దరఖాస్తుదారుల ఎంపికకు బాపట్లలోని రైలుపేట జమ్ములపాలెం ఆర్వోబీ వద్ద ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ వెంకట మురళి సమక్షంలో ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం లాటరీ తీయనున్నారు. తొలుత బాపట్ల పట్టణంలోని మద్యం దుకాణాలతో లాటరీ తీసే ప్రక్రియ ప్రారంభం కానుంది. తర్వాత చీరాల, రేపల్లె, అద్దంకి పట్టణాలకు లాటరీ తీయనున్నారు. చివరిగా యద్దనపూడి మండలంలోని దుకాణాలతో ప్రక్రియ ముగుస్తుంది. పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లను జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో గ్లోరియా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు, సహాయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రామాంజనేయులు ఆదివారం పరిశీలించారు. మద్యం దుకాణాల లైసెన్స్ కోసం జిల్లాలో మొత్తం 2148 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కొక్క దుకాణానికి రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వానికి రూ. 42.96 కోట్ల ఆదాయం లభించింది. విదేశాల్లో, దేశంలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పుణె, ముంబయి నగరాల్లో పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు ముందుకు వచ్చి మద్యం దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. కొందరు తమ బంధువులు, స్నేహితుల ద్వారా దరఖాస్తులు పెట్టించారు. చీరాల ప్రాంతంలో మహిళలు సైతం దరఖాస్తులు ఇవ్వడం గమనార్హం. అధికార పార్టీ నేతలు సైతం సిండికేట్ కూటమిగా మారి మద్యం దుకాణాల లైసెన్స్ కోసం దరఖాస్తులు అందజేశారు. ఇంకొల్లు మండలంలో అత్యధికంగా 114వ దుకాణానికి 47 దరఖాస్తులు రాగా, 113, 115 దుకాణాలకు 45 చొప్పున దరఖాస్తులు అందాయి. చివరి రోజు పోటాపోటీగా సమర్పించడంతో వీటి సంఖ్య పెరిగింది.

ఉదయం 6 నుంచి 6.30 గంటల మధ్య లోపలికి ప్రవేశం

8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభం

లాటరీలో షాపు దక్కించుకున్నవారు అదే రోజు ఆరో వంతు ఫీజు జమ చేయాలి

16 నుంచి నూతన విధానం

గెజిట్ నంబర్ల వారీగా ఎంపిక చేస్తారు. జిల్లాలో కలెక్టర్, జేసీ వేర్వేరుగా రెండు కౌంటర్ల వద్ద ఉండి వారి సమక్షంలోనే యంత్రాంగం లాటరీ తీసేలా ఏర్పాట్లు చేసింది. ఉదాహరణకు ఒక షాపునకు లాటరీ దక్కించుకున్న వ్యక్తి నిర్దేశిత లైసెన్సు ఫీజులో ఆరో వంతు వెంటనే శాఖకు జమ చేసేలా బ్యాంకు అధికారులను లాటరీ కేంద్రానికే రప్పించనున్నారు. ఆ వ్యక్తి అదే రోజు ఆరో వంతు ఫీజు చెల్లించకపోతే ఆ తర్వాత లాటరీ దక్కిన వ్యక్తికి కేటాయిస్తారు. అదే రోజు ప్రతి షాపునకు ముగ్గురిని లాటరీలో ఎంపిక చేస్తారు. ఒకవేళ మొదటి వ్యక్తే వచ్చి చెల్లింపు చేస్తే ఎలాంటి అభ్యంతరం ఉండదు. అతను చెల్లించని పక్షంలోనే రెండు, మూడో లాటరీ దక్కించుకున్న వారికి అవకాశం కల్పిస్తారు. ప్రతి షాపు లాటరీ విధానంలోనే కేటాయిస్తారు. 16 నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి వస్తుందని బాపట్ల జిల్లా ఈఎస్ గంటా దేవదత్తు తెలిపారు. ఇప్పటికే లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.



ఏర్పాట్లపై ఎక్సైజ్ అధికారులకు సూచనలిస్తున్న జేసీ ప్రఖర్ జైన్

ఒక్కో విడతలో ఐదు దుకాణాలకు..

సోమవారం లాటరీ నిర్వహణకు గంట ముందుగానే నిర్దేశిత లాటరీ నిర్వహణ ప్రదేశానికి చేరుకోవాలని దరఖాస్తుదారులకు ఎక్సైజ్ శాఖ యంత్రాంగం సూచించింది. ఉదయం 6 నుంచి 6.30 గంటల మధ్య ఎంట్రీ పాస్‌తో లోపలికి చేరుకోవాలని ఎంట్రీ పాస్ వెంట తెచ్చుకుంటేనే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఒక్కో విడతలో ఐదు షాపులకు లాటరీ తీయడానికి దరఖాస్తుదారులను లోపలికి పంపుతారు. మిగిలిన షాపులకు దరఖాస్తు చేసుకున్న అప్పటి దాకా అధికారులు సూచించిన చోట కూర్చోవాలని వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

శుభాలిచ్చే తల్లి.. కల్పవల్లీ..

దసరా నవరాత్రి ఉత్సవాలు ఊరూవాడా ఘనంగా సాగాయి. దశమి పండగ రోజు గ్రామాల్లో సందడి నెలకొంది. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామాల్లో అమ్మవారికి వైభవంగా పల్లకీ సేవ జరిపారు. పలుచోట్ల తెప్పోత్సవం నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. - న్యూస్‌టుడే బృందం


అద్దంకిలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం


బాపట్ల: దుర్గాదేవికి పూజ చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ


చీరాల పార్వేటలో దేవతామూర్తులను దర్శించుకుంటున్న భక్తులు


నిజాంపట్నం: ప్రమిదలతో అలంకరణ


చినగంజాం: సోపిరాలలో శ్రీరాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు

నారా రోహిత్.. మన రెంటచింతల అల్లుడే



గురజాల, రెంటచింతల, న్యూస్‌టుడే : సినిమా నటుడు నారా రోహిత్‌తో ఆదివారం నిశ్చితార్థం జరిగిన హీరోయిన్ శిరీషా స్వస్థలం పల్నాడు జిల్లా రెంటచింతల. వీరిది సామాన్య రైతు కుటుంబం. గురజాల మండలం దైదకు చెందిన నాగేశ్వరరావు ముప్పై ఏళ్ల క్రితం గ్రామం విడిచి రెంటచింతల వలసొచ్చారు. వ్యవసాయం చేస్తూ కష్టపడి తమ నలుగురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించారు. పెద్దమ్మాయి శ్రీలక్ష్మి రెంటచింతలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. రెండో అమ్మాయి భవానీ వివాహం అనంతరం అమెరికాలో స్థిరపడ్డారు. మూడో అమ్మాయి ప్రియాంక వివాహం చేసుకొని హైదరాబాద్‌లో ఉంటున్నారు. నాలుగో అమ్మాయి శిరీష ఆస్ట్రేలియాలో ఉన్నత చదువులు పూర్తి చేసి అక్కడే కొంతకాలం ఉద్యోగం చేశారు. సినీరంగంపై అభిమానంతో హైదరాబాద్‌కు వచ్చారు. తన అక్క ప్రియాంక వద్ద ఉంటూ సినిమాల్లో నటించేందుకు ప్రయత్నాలు చేశారు. నారా రోహిత్ హీరోగా నటించిన ప్రతినిధి-2లో హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నారు. వీరిద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోవడంతో ఆదివారం హైదరాబాద్‌లో వేడుకగా నిశ్చితార్థం నిర్వహించారు.

చెట్టుకొమ్మ విరిగి వాహన చోదకుల ఇక్కట్లు



రేపల్లె-నిజాంపట్నం మార్గంలో చెట్టు కొమ్మ కూలి రాకపోకలకు అంతరాయం కలిగిన ఘటన ఆదివారం కొమరవోలు వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు కొమరవోలు రొయ్యల కంపెనీ నుంచి రొయ్యలు తరలించే ఓ వాహనం ఈమార్గంలో వెళుతుండగా కామేశ్వరమ్మ ఆలయం సమీపంలో ఓ చెట్టు తగలడంతో కొమ్మవిరిగి రహదారిపై పడింది. దాంతో ఈ మార్గంలో వాహనాలు గంటకు పైగా నిలిచాయి. సమాచారం అందుకున్న నిజాంపట్నం పోలీసులు అక్కడకు చేరుకుని పడిన కొమ్మను స్థానికుల సాయంతో తొలగించడంతో సమస్య పరిష్కారమైంది. వాహనాలు యథావిధిగా నడిచాయి. - నిజాంపట్నం, న్యూస్‌టుడే

పవర్ లిఫ్టింగ్‌లో సాదియా ప్రతిభ



మంగళగిరి: సౌత్ ఆఫ్రికాలోని సన్‌సిటీలో ఈ నెల 4వ తేదీ నుంచి 13 వరకు జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పతకాలు సాధించినట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ భాస్కరరావు, షేక్ సందాని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 57 కేజీల విభాగం, స్క్వాట్ - 185 కేజీలు, బెంచ్ ప్రెస్ 95 కేజీలు, డెడ్ లిఫ్ట్ 180 కిలోల విభాగాల్లో పసిడి పతకాలు అందుకున్నారు. సాదియా అల్మాస్‌కు మంత్రి నారా లోకేశ్, సౌత్‌ఇండియా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

చేనేత క్లస్టరుకు కష్టాలు

✶ రూ.కోట్లు పోసినా నిరుపయోగంగా భవనాలు ✶ నేతన్నలకు అక్కరకు రాని శిక్షణ

చేనేత కార్మికుడి కష్టాలు తీర్చేందుకు కేంద్ర జౌళి శాఖ 2015-16 సంవత్సరంలో చేనేత క్లస్టర్ పథకాన్ని తీసుకువచ్చింది. పథకంలో భాగంగా నేత నేయడం దగ్గర నుంచి డిజైనింగ్, రంగుల అద్దకంపై అవగాహన కల్పించడంపై ప్రణాళికలు రూపొందించి కార్మికులకు శిక్షణ ఇవ్వాలి. అంతేకాకుండా ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించేందుకు సొంత భవనాలు నిర్మించి ఉపాధి కల్పించడానికి నిధులు సైతం మంజూరు చేసింది. కానీ ప్రస్తుతం కొన్ని భవనాల చుట్టూ పిచ్చి చెట్లు పెరిగి నిరుపయోగానికి తార్కాణంగా మారాయి. దీంతో ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు పెట్టి ఏ ఉద్దేశంతో వీటిని నెలకొల్పిందో అది నెరవేరకుండా పోయిందని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

జిల్లాలో మగ్గం నేయడం, అద్దకం, డిజైనింగ్‌పై జిల్లాలో 3,499 మంది కార్మికులకు 2016-17 సంవత్సరంలో సాప్(సొసైటీ ఫర్ వీవర్స్ వెల్‌ఫేర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో శిక్షణ కల్పించింది. ఇలా ఒక్కొక్క కార్మికుడుకి మూడు విభాగాల్లో దాదాపు 90 రోజుల శిక్షణ ఇచ్చారు. దీనికోసం కార్మికుడికి రోజుకు రూ. 250 వరకు భృతి అందజేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో వస్తున్న పోటీకి అనుగుణంగా కార్మికులకు కొత్తవాటిపై శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఒక్కొక్క కామన్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 31.59 లక్షలు మంజూరు చేసింది. వీటిలో మగ్గం, నూతన డిజైన్లు, నూలుకి రంగులు అద్దకం వేయడానికి వీలుగా గదులు నిర్మించారు. అంతేకాకుండా కార్మికులంతా ఒకే చోట కూర్చోవడానికి వీలుగా పెద్ద హాలు ఏర్పాటు చేశారు. నిధులు సకాలంలో ప్రభుత్వం విడుదల చేసినా గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగాయి. దీనికితోడు అధికారులు పర్యవేక్షణ లేకపోవడం, స్థల సమస్య తదితర కారణాలతో ఆలస్యం జరిగింది. ఎనిమిదేళ్ల క్రితం వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టినా ఇంకా రెండు భవనాలు నేటికి పూర్తి కాకపోవడం గమనార్హం.


విఘ్నేశ్వర కాలనీలో చిల్లచెట్ల మధ్య క్లస్టర్ భవనం

భవనాలు ఎక్కడెక్కడంటే..

జిల్లాలో రేపల్లె, చెరుకుపల్లి, వేటపాలెం, దేశాయిపేట తూర్పు, పడమర, విఘ్నేశ్వర కాలనీ, చేనేతపురి, ఈపురుపాలెంలో మూడు, చీరాల రెండు, మార్టూరు ప్రాంతాల్లో వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయినా ఇంకా మార్టూరు, రేపల్లె క్లస్టర్ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. పూర్తయిన వాటిని ప్రారంభించేందుకు ప్రభుత్వపరంగా ఎటువంటి నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులే వాటిని తూతూమంత్రంగా కొన్నిచోట్ల ప్రారంభించి తాళాలు వేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కేవలం మగ్గం ఉన్న కార్మికుడికి రూ. 24వేలు సాయం మాత్రమే అందించి చేతులు దులుపుకుంది. ఫలితంగా గడిచిన అయిదేళ్ల కాలంలో చేనేత పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో ఒక్క చీరాల నియోజకవర్గంలో దాదాపు పదిమంది నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ప్రణాళికలు రూపొందించాం

చేనేత కార్మికుల అభివృద్ధికి 'స్వర్ణాంధ్ర- 2047'లో భాగంగా రాబోయే అయిదేళ్లలో ప్రణాళికలు రూపొందించి కలెక్టరుకు నివేదిక అందించాం. కార్మికులకు మెరుగైన జీవనం కల్పించేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న క్లస్టర్ భవనాల్లోకి కావాల్సిన మౌలిక వసతులు, శిక్షణ పరికరాలు, వర్క్‌షెడ్ పథకం, చేనేత పార్కు లాంటివి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే క్లస్టర్ భవనాలు తెరచి, కార్మికులకు నూతన డిజైన్లలో శిక్షణ ఇప్పించే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని తెలిపారు.

- నాగమల్లేశ్వరరావు, జిల్లా చేనేత అధికారి, బాపట్ల

పొంగిన నాగన్న వాగు

రాకపోకలకు ఇబ్బంది

నీలాయపాలెం (చినగంజాం), న్యూస్‌టుడే: చినగంజాం మండలం నీలాయపాలెం గ్రామ పరిధిలోని నాగన్న వాగుపై వరద నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు రెండు రోజులపాటు ఇబ్బంది పడ్డారు. ఆ ప్రాంతంలో భారీగా వర్షం కురవడంతో ఎగువన ఉన్న పొలాల నుంచి వరద నీరు వాగుపైకి మోకాళ్లలోతులో చేరింది. దీంతో నీలాయపాలెం, ఉప్పుగుండూరు, పెదగంజాం, చినగంజాం ప్రాంతాల ప్రజల రాకపోకలకు అవస్థలు తప్పలేదు. ఆ ప్రాంతాన్ని చినగంజాం ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఉప్పలపాటి శ్రీనివాసరావు, ఎస్సై శీలం రమేష్, నీలాయపాలెం సర్పంచి తూమాటి శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రజలు వాగులోకి దిగకుండా శనివారం రాత్రంతా సిబ్బందిని ఏర్పాటుచేసి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. వాగు చప్టాపై చేరిన తుమ్మచెట్లను, చెత్తాచెదారాన్ని పొక్లెయిన్‌తో తొలగించి, నీరు లేకుండా చేశామని ఇన్‌ఛార్జి తహసీల్దార్ తెలిపారు. ఆదివారం సాయంత్రానికి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని ఆయన వివరించారు.


మోకాళ్ల లోతులో నిలిచిన వరద నీరు


రైల్వే మూడోలైను ఏర్పాటు సమయంలో కట్ట వేయకుండా వదిలేయడంతో చేరిన వరద నీరు

అధికారులకు విన్నవించినా..

నీలాయపాలెం ప్రాంతం వద్ద ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్ పరిధిలో ఇటీవల రైల్వే మూడోలైను వేశారు. ఆ సమయంలో లైనుకు అవసరమైన మట్టిని ఒక చోట తవ్వి, ఉంచారు. ఇనుప స్తంభాలను అక్కడే వదిలేశారు. మట్టి తవ్విన ప్రాంతంలో పూడ్చలేదు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఎగువన ఉన్న పొలాల నుంచి తవ్వి వదిలేసిన పల్లపు ప్రదేశం నుంచి నీరు నాగన్న వాగుపైకి చేరింది. వర్షాలకు ఇబ్బంది ఉంటుందని సుమారు నెల రోజుల క్రితం సంబంధిత శాఖ అధికారులను కలిసి తవ్విన గుంతను పూడ్చాలని, ఇనుప స్తంభాలు తొలగించాలని గ్రామస్థులతో కలిసి విన్నవించామని నీలాయపాలెం సర్పంచి శ్రీనివాసరావు తెలిపారు. వారు పట్టించుకోలేదని సర్పంచి ఆవేదన వ్యక్తం చేశారు. మేం విన్నవించినది చేస్తే వాగుపైకి నీరు చేరేదికాదన్నారు. అధికారులు ఇకనైనా దృష్టి సారించి వెంటనే గుంతను పూడ్చి, ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బండ్లమ్మ సన్నిధిలో నరసరావుపేట ఎంపీ

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు శ్రీబండ్లమ్మ అమ్మవారిని విజయదశమి సందర్భంగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శనివారం సందర్శించారు. ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు పూర్ణాహుతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేగేశన మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలోని సిమెంటు సింహాల స్థానంలో నూతనంగా రాతి పీఠం, పంచ లోహాలతో సింహాలు సొంత ఖర్చుతో తయారు చేయించి అమ్మవారికి సమర్పిస్తామన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు దంపతులను ఆలయ అధికారులు సన్మానించి, అమ్మవారి చిత్రపటం, పండ్లు అందజేశారు.



ఎంపీ దంపతులకు పండ్లు అందిస్తున్న ఈవో నరసింహామూర్తి

శ్రీ మహర్షి ఆశ్రమ గోశాలలో తెన్నేటి పూజలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : విజయదశమి వేడుకలను స్థానిక శ్రీ మహర్షి ఆశ్రమ గోశాలలో ఘనంగా నిర్వహించారు. గోశాల అధిష్ఠాన దేవత నవనాగ సహిత మానసాదేవి అమ్మవారు వజ్ర కవచధారియై భక్తులకు దర్శనమిచ్చారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ దేవాలయంలో జరిగిన కుంకుమార్చన, మహ చండీ యాగాల్లో పాల్గొని శమీ వృక్ష పూజ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. బాబూ నాగేంద్ర, బీవీఎస్ నారాయణభట్టు, భక్తులు పాల్గొన్నారు.



హోమంలో ఎంపీ కృష్ణప్రసాద్

ఆధ్యాత్మికం

ప్రవాస భారతీయుల దసరా ఉత్సవాలు

అద్దంకి: అగ్రరాజ్యం అమెరికాలోని ప్రవాస భారతీయులు దసరా ఉత్సవాలను తెలుగు సంప్రదాయం ప్రకారం జరుపుకొన్నారు. అమ్మవారి చిత్రపటాలు, విగ్రహ ఏర్పాటు చేసుకుని తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు వారు అధికంగా నివసించే డల్లాస్, టెక్సాస్, మెలిస్సా, ఫ్లోరిడా, మినియాపోలిస్ తదితర ప్రాంతాల్లో భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు వేడుకలు నిర్వహించారు. విగ్రహాలు, చిత్రపటాలు నెలకొల్పిన ప్రాంతాలలో తాము ఇళ్ల వద్ద తయారు చేయించిన, కొనుగోలు చేసిన ప్రసాదాలను వద్ద ఉంచి భక్తులకు పంచారు.



అమెరికా డల్లాస్ రాష్ట్రం దసరా ఉత్సవాల్లో ప్రవాస భారతీయులు

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ వద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు రాజీ లేకుండా వ్యవహరించాలని ఎస్పీ తుషార్‌డూడీ అన్నారు. జిల్లా ఏఆర్ కార్యాలయంలో దసరా వేడుకల్లో భాగంగా ఆయుధ పూజ నిర్వహించారు. దుర్గాదేవికి ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ దుష్ట శిక్షణ..శిష్ట రక్షణకు పోలీసులు కట్టుబడి ఉండాలన్నారు. పోలీసుశాఖ ప్రతిష్ఠ పెంచేలా పని చేయాలన్నారు. వాహనాలకు పూజలు నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్‌బీ సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, సీఐలు హరికృష్ణ, గంగాధర్, అహ్మద్‌జానీ తదితరులు పాల్గొన్నారు.



వాహనానికి పూజ చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు

మార్టూరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ఓ వ్యక్తి రోడ్డుపై పడి, అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఘటన మార్టూరులో జరిగింది. శనివారం రాత్రి మార్టూరు - జొన్నతాళి జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో జరిగిన ప్రమాదంపై మార్టూరు సీఐ మద్దినేని శేషగిరిరావు వివరాలు వెల్లడించారు. మండలంలోని వలపర్లకు చెందిన కొప్పుల సుబ్బయ్య (48), గారపాటి శ్రీను కలిసి మార్టూరు నుంచి స్వగ్రామం వలపర్ల వెళ్తుండగా నూలుమిల్లు సమీపంలో వారు ప్రయాణించే ద్విచక్రవాహనం అదుపుతప్పి, ఇద్దరు రోడ్డుపై పడి తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఈ ఘటనలో సుబ్బయ్య సంఘటన స్థలంలోనే మృతిచెందగా, తీవ్ర గాయాలైన శ్రీనును మెరుగైన వైద్య సేవల కోసం గుంటూరు తరలించారన్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం మృతదేహానికి పరీక్షలు నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు. కాగా సుబ్బయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారన్నారు.



సుబ్బయ్య (పాతచిత్రం)

రైలు నుంచి జారి పడి యువకుడు..

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఇది. కర్లపాలెం మండలం తారకరామనగర్ యానాది కాలనీకి చెందిన యాటగిరి దుర్గాప్రసాద్ (25) శుక్రవారం అర్ధరాత్రి బాపట్ల నుంచి తెనాలి వైపు వెళ్లే రైలు ఎక్కాడు. రైలు గేటు వద్ద నిలబడి ఉండగా రైలు బాపట్ల దాటుతుండగా గుంటూరు పై వంతెన వద్ద జారి పడ్డాడు. గాయాలపాలై పెద్దగా కేకలు వేస్తుండటంతో స్థానికులు 108లో చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సరస్వతి తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడు..

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : వెనుక నుంచి లారీ ఢీకొనటంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిసిన వివరాల మేరకు గుంటూరు జిల్లా పెదనందిపాడు గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ జానీ (70) కొంత కాలం క్రితం అనారోగ్యానికి గురై మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నేపథ్యంలో గత ఆరునెలల క్రితం కర్లపాలెంలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. శుక్రవారం తన సొంతూరు పెదనందిపాడు వెళ్లేందుకు జాతీయ రహదారిపై కాలినడకన బాపట్ల వైపు వస్తుండగా కర్లపాలెం నుంచి బాపట్ల వైపు వస్తున్న లారీ మార్కెట్‌యార్డు సమీపంలో టైల్స్ దుకాణం ఎదురుగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈఘటనలో తలకు తీవ్రగాయాలైన మహబూబ్‌జానీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రాంతీయ వైద్యశాలకు తరలించి అనంతరం బంధువులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ తెలిపారు. మృతుడికి భార్య, వివాహమైన కుమార్తెలు ఉన్నారు.

అంతర్జాతీయ క్రీడల్లో నగరం వాసి సత్తా

నగరం, న్యూస్‌టుడే: మండలంలో బెల్లంవారిపాలెం గ్రామానికి చెందిన గుంటూరు వెంకట్రావు అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించాడు. ఉద్యోగరీత్యా తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరు గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న వెంకట్రావు ఈనెల 10 నుంచి 13 వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో దేశం తరఫున ఆడేందుకు ఎంపికయ్యాడు. అక్కడ జరిగిన హైజంప్‌లో బంగారు, ట్రిపుల్ జంప్‌లో రజత పతకాలు సాధించినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు.



గుంటూరు వెంకట్రావు

10 మంది జూదరుల అరెస్టు

అమృతలూరు, న్యూస్‌టుడే: మండలంలోని యలవర్రులో జూద స్థావరంపై పోలీసులు ఆదివారం ఆకస్మికంగా దాడులు చేశారు. 10 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.4,040 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అమరవర్ధన్ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

హత్యే అంటున్న బంధుమిత్రులు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: రాత్రి భోజనం చేసి వ్యక్తి.. ఫోన్ రావడంతో బయటకు వెళ్లగా ఉదయానికల్లా నిర్జీవంగా పడి ఉన్న సంఘటన చీరాల మండలం కీర్తివారిపాలెం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు చెప్పిన వివరాల మేరకు.. వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామానికి చెందిన పులి శ్రీనివాసరావు (40), మాజీ శాసనసభ్యుడు కరణం బలరాం అనుచరుడిగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. కుమార్తెలు ఇద్దరికి వివాహం చేశారు.. కొడుకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి బంధువులతో విందు భోజనం ఆరగించారు. రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లారు. పండక్కి ఇంటికి వచ్చిన చిన్న కుమార్తెకు హఠాత్తుగా ఆరోగ్యం బాగోలేక చికిత్స కోసం చీరాల వచ్చి, తండ్రి కోసం రాత్రి 11 గంటల సమయంలో ఫోన్ చేయగా..స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈక్రమంలో ఉదయం బంధువులు తలో దిక్కుకు వెళ్లి గాలించారు. 10.30 గంటల సమయంలో కీర్తివారిపాలెం ఇవతల నగర వనం సమీపంలో చీరాల రహదారి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న వంతెన వద్ద ఉన్న కాలువలో ఒక ద్విచక్ర వాహనం పడి పోయి కనిపించింది. స్థానికులు కాలువలోకి దిగి చూడగా.. బైక్ పక్కన శ్రీనివాసరావు మృతదేహం కనిపించింది. తలపై గాయాలున్నాయి. . వాహనం కొంత వరకు దెబ్బతింది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై శివకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పాపాయిపాలెం, చల్లారెడ్డిపాలెం తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది ఆసుపత్రికి చేరుకుని విలపించారు. భార్య కోటేశ్వరమ్మ నుంచి వివరాలు సేకరించిన పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు బంధువులు చనిపోయిన వ్యక్తికి ఎవరితోనూ గొడవలు లేవంటున్నారు. కానీ ఇది కచ్చితంగా పథకం ప్రకారం చేసిన హత్యే అంటున్నారు. పోలీసులు జాగిలాన్ని రప్పించి, ఆధారాలు సేకరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం చీరాల ఏరియా వైద్యశాలకు చేరుకుని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులతో మాట్లాడారు. కేసును చేధించాలని చేదించి నిజ నిజాలు వెలికితీయాలని సీఐ శేషగిరిరావు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. శ్రీనివాసరావు సెల్ ఫోన్ కని పించలేదని చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



శ్రీనివాసరావు మృతదేహం

విగ్రహ నిర్మాణానికి రూ.2 లక్షలు అందజేత



నగదును నిర్వాహకులకు అందజేస్తున్న 1994-95 పదో తరగతి పూర్వ విద్యార్థులు

సోపిరాల (చినగంజాం), న్యూస్‌టుడే: సోపిరాల సెంటర్‌లో దివంగత కాపు సంఘం నేత, వంగవీటి రంగా కాంస్య విగ్రహం, బస్టాండ్ నిర్మాణానికి గ్రామస్థులు సిద్ధమయ్యారు. సుమారు రూ.25 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. దీనిలో భాగంగా చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన సోపిరాలకు చెందిన 22 మంది విద్యార్థులు తమ వంతుగా రూ.2,01,510 విరాళంగా అందించారు. ఈ నగదును ఆదివారం అందజేశారని సోపిరాల గ్రామ పెద్ద డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల పట్టణం: జిల్లాలో డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి జె. రాజాదిబోరా ఆదివారం తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు అభ్యర్థులు ఈనెల 21లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఉచిత బోధన, భోజనం, వసతి సౌకర్యాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన ప్రైవేట్ సంస్థల ద్వారా కోచింగ్ సెంటర్లలో మూడు నెలలపాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏపీటెట్ అర్హతలు ఇంటర్మీడియట్‌తో పాటు డైట్ సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హతలు కలిగి ఉండి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2.50 లక్షలు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు

(కేజీ ఒక్కింటికి రూ.లలో)

వేటపాలెం: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 228, లైవ్ స్కిన్‌లెస్ - 259.

కృష్ణా జిల్లాలో: వెన్నెల: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135 రిటైల్ ధర 157 లైవ్ విత్ స్కిన్ - 228, లైవ్ స్కిన్‌లెస్ - 259.

తూర్పుగోదావరి జిల్లాలో... బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర 140, 149, 160 లైవ్ విత్ స్కిన్ - 268 లైవ్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర: ... 100 గుడ్లు ధర రూ. 505 (వర్తకులు & రిటైల్ అమ్మకం...)

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

రేపల్లె అర్బన్: విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రేపల్లె మండలం మోర్లవారిపాలెం, పేటేరు, కైతేపల్లి, బొబ్బర్లంక, చోడాయపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, తుమ్మల, పోటుమెరక, నిర్మల్‌నగర్, మోళ్లగుంట, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఇన్‌చార్జి డీఈ రాజశేఖరబాబు తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి పల్లె పండగ

చుండూరు: తెదేపా నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు చుండూరు మండలం యడ్లపల్లి, అమృతలూరు మండలం అమృతలూరు, వేమూరు మండలం కుచ్చెళ్లపాడు, వెల్లబాడు గ్రామాల్లో సోమవారం జరిగే పల్లె పండగలో ఎమ్మెల్యే ఆనందబాబు పాల్గొంటారని చుండూరు ఇన్‌ఛార్జి ఎంపీడీవో కుమారస్వామి తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించే సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేస్తారని ఆయన చెప్పారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

నిజాంపట్నం, న్యూస్‌టుడే : తీరంలో గ్రామీణ ప్రాంత పేదలు భక్త ప్రసన్నాంజనేయ స్వామి ట్రస్ట్ సేవలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ట్రస్ట్ ఛైర్మన్ యేమినేని వెంకట రమణారావు అన్నారు. దసరా సందర్భంగా దిండి పంచాయతీలో పేద మహిళలకు కుట్టు మిషన్లు, గ్రామాల్లో తాగునీటి అవసరాలకు చేతి పంపులు పంపిణీ చేశారు. ఆయాన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుల సూచన మేరకు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. నర్రావారిపాలెం గ్రామంలో శుద్ధ మంచినీటి కేంద్రం ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. మాజీ సర్పంచి యేమినేని సుజాత, తెదేపా నాయకులు ఖాదర్‌బాబు, నర్రా సునీల్, నక్కల పోలిరాజు, గంగరాజు తదితరులున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? కొల్లూరు శివారు కేటీ కాలనీకి వెళ్లే రహదారిలో సుమారు అర కిలోమీటరు దూరం వరకు వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. పంచాయతీ వారు పట్టించుకోవడం లేదు. ఈ రహదారికి ఇరువైపులా ఉన్న మాగాణి పొలాల నుంచి పాములు రాత్రి వేళ రహదారిపైకి చేరుతుండడంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. - **తుపాకుల హరినాథ్, కొల్లూరు**

✔ పరిశీలించి, వీధిదీపాలు వెంటనే వెలిగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరిస్తాం. - **భట్టిప్రోలు మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి, కొల్లూరు**

– న్యూస్‌టుడే, కొల్లూరు

? గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. ద్విచక్ర వాహనదారులు, పాదచారుల వెంట పడుతున్నాయి. వృద్ధులు, మహిళలు భయపడుతున్నారు. - **స్థానికులు, అమృతలూరు**

✔ సర్పంచి, పాలకవర్గ సభ్యులతో చర్చించి చర్యలు తీసుకుంటాం. కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం. - **కుమార్, పంచాయతీ కార్యదర్శి, అమృతలూరు**

– న్యూస్‌టుడే, అమృతలూరు

? చుండూరులో సేకరించిన చెత్తను సంపద సృష్టి కేంద్రం సమీపంలో ప్రధాన రహదారి పక్కన పోస్తున్నారు. అందులో మిగిలిపోయిన భోజన పదార్థాలు ఉండడం వల్ల వాటిని కుక్కలు చిందర వందర చేస్తున్నాయి. ఎంగిలి ఆకులు రోడ్డుపై చేరుతున్నాయి. - **స్థానికుడు, చుండూరు**

✔ వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి చెత్తను తొలగిస్తాం. - **కుమారస్వామి, ఈవోపీఆర్డీ చుండూరు**

– న్యూస్‌టుడే, వేమూరు

? నడింపల్లి యాదవపాలెంలో తాగునీటి కుళాయి నుంచి నీరు లీకై వృథాగా పోతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. - **లక్ష్మయ్య, నడింపల్లి**

✔ నీటికొళాయి తుప్పుపట్టి విరిగింది. దీనికి మరమ్మతులు చేయడం లేదా కొత్తది ఏర్పాటు చేస్తాం. నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. - **మహేష్, పంచాయతీ కార్యదర్శి, నడింపల్లి**

– న్యూస్‌టుడే, నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ)

వీధి దీపాలు వెలిగించారు

స్పందనకు వందనం

కాపూరు (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలను అధికారులు సరిచేశారు. ఈ విషయమై ఈనెల 10న 'మేమున్నాం..మీతోడుగా' శీర్షిక 'ఈనాడు' అధికారుల దృష్టికి తేగా వారు స్పందించారు. రెండ్రోజులుగా పంచాయతీ పరిధిలోని అన్ని వీధి దీపాలను అధికారులు సిబ్బందితో పరిశీలన చేయించి సరిచేశారు. ఇకపై సమస్య తలెత్తనీయమని కార్యదర్శి డోగేంద్ర తెలిపారు. పనుల నిర్వహణ పట్ల స్థానికులు హర్షం తెలిపారు.

కుండపోత వర్షంతో రహదారులు జలమయం



కాలువను తలపిస్తున్న వైష్ణాలయం వెనుక రోడ్డు



బస్టాండు కూడలి వద్ద స్టేట్ బ్యాంక్ రోడ్డులో మోకాలి లోతు నీరు

కొల్లూరు, న్యూస్‌టుడే: మండలంలో శనివారం అర్ధరాత్రి సమయంలో చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం ఆదివారం తెల్లవారుజామున కుండ పోతగా కురవడంతో మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో పల్లపు రహదారులు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల ఇళ్లలోకి సైతం నీరు చేరింది. ముఖ్యంగా మండల కేంద్రం కొల్లూరులో మురుగు నీటిపారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పల్లంగా మారిన రహదారులతో పాటు ఇటీవల ఎత్తుగా పునర్నిర్మాణం చేసిన రహదారులపైనా వర్షం నీరు నిలిచింది. ఈ నీటితో మురుగు కాల్వల్లోని మురుగు కలిసి రహదారులను ముంచెత్తడంతో నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి దాపురించింది. స్థానిక బస్టాండు కూడలి - స్టేట్ బ్యాంకు రహదారి, వైష్ణాలయం వెనుక రహదారి, గతేడాది నిర్మాణం చేసిన యూనియన్ బ్యాంకు రహదారి, మసీదు, లాకుల కూడలి ప్రాంతాల్లో రహదారులపై భారీగా వర్షం నీరు నిలిచింది. దీంతో రాకపోకలు ఇబ్బందిగా మారాయి. ఇటీవల సంభవించిన కృష్ణానది వరదల వల్ల లంక గ్రామాల్లోని మెట్ట పంటలు తుడిచి పెట్టుకు పోవడంతో ఆ పొలాల్లో చాలా వరకు రైతులు కొద్ది రోజుల క్రితం మినుము పంట విత్తుకున్నారు. లేత దశలో ఉన్న ఈ పంట కొన్ని చోట్లనీట మునగడం, మరి కొన్ని చోట్ల ఉరక సమస్య తలెత్తడంతో తొలకరిలో సాగు చేసిన ప్రధాన పంట వరదల వల్ల చేతికి రాకపోయినా కనీసం మినుము పంటైనా దక్కుతుందనే రైతుల ఆశలపై ఈ వర్షం నీళ్లు చల్లినట్లయింది.

అప్రమత్తతతో ప్రాణనష్టాన్ని నివారించాం



బాధితులకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, న్యూస్‌టుడే: కనీవినీ ఎరుగని రీతిలో ఇటీవల కృష్ణానదికి సంభవించిన వరదల్లో అధికారులు అడుగడుగునా అప్రమత్తంగా వ్యవహరించి, తగిన ఏర్పాట్లు చేయడం వల్ల ప్రాణ నష్టం కలగకుండా లంక గ్రామాల ప్రజలను రక్షించగలిగామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఆవులవారిపాలెం శివారు క్రీస్తులంకలో 300 వరద బాధిత కుటుంబాలకు ఏఈఎల్‌సీ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, దుప్పట్ల పంపిణీని శనివారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదల్లో చిక్కుకున్న ప్రతి ఒక్కరికీ అయిదు రోజుల పాటు ఆహారం, మంచినీరు అందించిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి చిన్నం కిషోర్, తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



రేపల్లె: శంకుస్థాపన చేస్తున్న తెదేపా నేత అనగాని శివప్రసాద్

పేటేరు (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రేపల్లె మండలం పేటేరు శివారు బావాజీ తోటలో శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో దేవాదాయశాఖ కామన్‌గుడ్ ఫండ్ నిధులు రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు తెదేపా నాయకుడు అనగాని శివప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో మంజూరైన నిధులతో జీవ ధ్వజస్తంభం, ఆలయ ముఖ ద్వారం పునఃనిర్మాణం, ఆలయ ప్రాంగణం మెరక, ప్రహరీ నిర్మాణానికి వినియోగిస్తున్నట్లు ఈవో వెంకట అప్పలాచార్యులు తెలిపారు. నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, గుర్రం మురహరిరావు, శేషు, వెంకటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు.. సజ్జావారిపాలెం(నగరం): గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని సజ్జావారిపాలెంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిని గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం



ధ్వజానికి గౌరవ వందనం చేస్తున్న కార్యకర్తలు

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని చెరుకుపల్లి గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ దేవాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా శారీరక ప్రముఖ్ మోహన్, రేపల్లె ఖండ్ ప్రముఖ్ ఉప్పు సాంబశివరావు ముఖ్య అతిథులుగా హాజరై ఆర్ఎస్ఎస్ నూరేళ్ల ప్రస్థానాన్ని వివరించారు. భారతీయులంతా ఒకేజాతి అని నమ్మే సంస్థ ఆర్ఎస్ఎస్ అని తెలిపారు. అనంతరం ధ్వజావిష్కరణ చేసి కార్యకర్తలు గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మండల ప్రముఖ్‌లు కోట విజయకుమార్, కపిలవాయి శ్రీనివాసరావు, యెల్లెల రజని, గొల్లపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంగాంబికా అమ్మవారికి వెండి కిరీటం



వెండి కిరీటం అందిస్తున్న బ్రహ్మయ్య

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని గుళ్లపల్లి శ్రీగంగాంబికా సమేత ఆనందీశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగాఅమ్మవారు శ్రీరాజరాజేశ్వరీగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన వాగు బ్రహ్మయ్య రూ.50వేల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణకు ఆయన అందించారు. సంప్రోక్షణ అనంతరం ఆదివారం స్వామి వారి కల్యాణం సందర్భంగా అలంకరిస్తామని ధర్మకర్త తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఓగిరాల వీరాస్వామి, జంపాని శ్రీనివాసరావు, కాటూరి శ్రీనివాసరావు, ఉల్లంగుంట శివరామకృష్ణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో వసతుల కల్పనపై దృష్టిపెట్టరూ!



మాట్లాడుతున్న కేసన శంకరరావు

నిజాంపట్నం, న్యూస్‌టుడే : జిల్లాలో వెనుకబడిన తీర ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామం బొర్రావారిపాలెం వచ్చిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం తీర ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. నిజాంపట్నం పోర్టును కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందని ప్రజలు, మత్స్యకారులుఎదురు చూస్తున్నారన్నారు. తీరప్రాంత రవాణా మెరుగు పడాలన్నా, మత్స్య ఎగుమతులు జరగాలన్నా నిజాంపట్నం పోర్టును కలుపుతూ రైల్వే లైన్ బాపట్ల వరకు విస్తరించాలని శంకరరావు డిమాండ్ చేశారు. ముఖ్యంగా పర్యాటక రంగ అభివృద్ధికి అనువైన వనరులు తీర ప్రాంతంలో మెండుగా ఉన్నాయని నిజాంపట్నం - బాపట్ల మధ్య పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు వెనుకబడిన తీర ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. పాలకులు ఆ దిశగా దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘ నేతలున్నారు.

వైద్య కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

బాపట్ల, న్యూస్‌టుడే: వైద్య కళాశాల నిర్మాణాన్ని ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైకాపా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కష్ట సమయంలో ఉన్నప్పుడు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. వైకాపాను బలోపేతం చేసి వచ్చే రెండేళ్లలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కష్టపడి కృషి చేద్దామన్నారు. తెదేపా నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేసేలా ఒత్తిడి తీసుకొద్దామన్నారు.

ఎస్సీ వర్గీకరణ తగదు



మాట్లాడుతున్న వెంకట్రావు

నగరం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఏనాడో తీర్పు ఇచ్చిందని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు అన్నారు. మండల పరిధిలోని సజ్జావారిపాలెంలో శనివారం నిర్వహించిన మాలల చైతన్య సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పటి రాష్ట్ర ప్రభుత్వం, వర్గీకరణ కోరుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు పునఃసమీక్ష కోరుతూ కోర్టులో అర్జీ దాఖలు చేయలేదన్నారు. పలు పార్టీల నేతలు రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ వర్గీకరణకు యత్నిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు గోళ్ల అరుణ్‌కుమార్, చల్లపల్లి కోటేశ్వరరావు, దోవా రామేష్ రాంజీ తదితరులు ప్రసంగించారు.

వీడని కోతుల బెడద



విజయలక్ష్మీపురంలో వానర సంచారం

బాపట్ల, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో కోతుల సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. కోతుల దాడులతో కాలనీవాసులు బెంబేలెత్తుతున్నారు. బేస్తపాలెంలో ఇటీవల జరిగిన కోతుల దాడిలో ఎంఎస్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఎండీ శేషుకృష్ణ గాయపడ్డాడు. విజయలక్ష్మీపురం, త్యాగరాయనగర్, ఇస్లాంపేట, నరాలశెట్టిపాలెంలో కోతులు గుంపులుగా సంచరిస్తూ ఇళ్లలోకి వచ్చి వస్తువులు, సామాన్లను పాడు చేస్తున్నాయి. మొక్కలు పీకేస్తున్నాయి. పువ్వులు, కాయలు కోసి చిందర వందరగా పడేస్తున్నాయి. ఇంట్లో నుంచి బయటకు వస్తే వానరాలు దాడులు చేస్తాయని పట్టణ వాసులు భయపడుతున్నారు. దీనిపై పురపాలక ఏఈ ఉమామహేశ్వరరావును సంప్రదించగా కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బాపట్ల: పోలేరమ్మ ఆలయంలో రాజరాజేశ్వరిగా



బాపట్ల: శంకర విద్యాలయంలో పూల సింహాసనంపై..



బాపట్ల: కన్యకాపరమేశ్వరి ఆలయంలో త్రిశూలధారిమై..



బాపట్ల: సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత భావన్నారాయణస్వామి ఉత్సవ మూర్తులు



భట్టిప్రోలు: పుష్పాలంకృతులైన వాసవీ అమ్మవారు



వేమూరు: పెరవలిలో నిమ్మకాయల హారంతో..



భట్టిప్రోలు: ట్రాక్టర్‌పై కనకదుర్గమ్మ



వేమూరు: చావలి వాలేశ్వరస్వామి ఆలయంలో



రాజరాజేశ్వరి అలంకారంలో చెరుకుపల్లి బాలాత్రిపురసుందరిదేవి



రేపల్లె: పేటేరులో పూజలందుకున్న అమ్మవారు



రేపల్లె: ఇసుకపల్లిలో వెండి కిరీటంతో..



పి.వి.పాలెం: ప్రసన్న వదనంతో చందోలు బండ్లమ్మ



పి.వి.పాలెం: ఖాజీపాలెంలో..



చెరుకుపల్లి: కావూరులో



చెరుకుపల్లి: నయన మనోహరంగా నడింపల్లి రెడ్డంకమ్మ

దివ్యరూపిణీ పాహిమాం

బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో తొమ్మిది రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఆలయాల్లో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శమీపూజ, ఆయుధ పూజ చేశారు. చుండూరు మండలం మోదుకూరులోని శ్రీకనకదుర్గ ఆలయంలో వార్షిక ఆచారంలో భాగంగా శనివారం తెల్లవారుజామునే గుడి తలుపులను మూసివేశారు. తిరిగి తొమ్మిదో రోజున తలుపులు తెరవనున్నారు.

- న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గ బృందం



బాపట్ల: శమీ పూజ నిర్వహిస్తున్న భక్తులు



కర్లపాలెం: పెద్దింటమ్మ ఆలయంలో అన్నసంతర్పణ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ



పి.వి.పాలెం: అల్లూరులో జమ్మిచెట్టుకు పూజలు

వైభవంగా కనకదుర్గమ్మ విగ్రహాల నిమజ్జనం



అమృతలూరు: విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

బాపట్ల, భట్టిప్రోలు, అమృతలూరు, నిజాంపట్నం, న్యూస్‌టుడే : దసరా పండగ పురస్కరించుకుని ఆయా మండలాల్లో గ్రామాల్లో ఏర్పాటు చేసిన శ్రీకనకదుర్గమ్మ విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. నవరాత్రులు అమ్మవారిని పూజించి, ట్రాక్టర్లపై ఊరేగించి భక్తుల నుంచి హారతులు స్వీకరించారు. బాపట్ల రైలుపేట మూడు, నాలుగు వార్డుల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలతో ఆదివారం రాత్రి నగరోత్సవం నిర్వహించి సూర్యలంక సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. తప్పెట్లు, డీజేలతో ఊరేగింపు సాగింది.



బాపట్ల: దుర్గాదేవి నగరోత్సవం



నిజాంపట్నం: కూచినపూడిలో కనకదుర్గమ్మ ఊరేగింపు

అలసత్వం.. పొంచిన అపాయం

చుండూరు, న్యూస్‌టుడే: మండలంలోని నడిగడ్డపాలెంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న 11కేవీ విద్యుత్తు తీగలకు ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు తాకుతున్నాయి. వాటిని తొలగించకపోతే తరచూ విద్యుత్తు అంతరాయం తలెత్తడంతో పాటు, దారిన వెళ్లే వారు వాటిని తాకితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. పరిస్థితి ఇలా ఉన్నా సంబంధిత శాఖ అధికారుల నుంచి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై చుండూరు విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ అర్జునరావును వివరణ కోరగా వెంటనే విద్యుత్తు సహాయకులను నియమించి చెట్ల కొమ్మలు తొలగిస్తామని సమాధానం ఇచ్చారు.



ప్రాథమిక వైద్య కేంద్రం ప్రారంభం

కర్లపాలెం, న్యూస్‌టుడే: పెద్దింటమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆలయ ట్రస్టు సహకారంతో ఏర్పాటు చేసిన సాయి ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఇక్కడ ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పెద్దింటమ్మ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పెన్మెత్స కృష్ణంరాజు, సత్యనారాయణరాజు, మంతెన కరుణరాజు, శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా గ్రామ సేవల ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరుకుపల్లి ఎంపీడీవోగా షేక్ మహబూబ్ సుబాని

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: చెరుకుపల్లి ఎంపీడీవోగా షేక్ మహబూబ్ సుబానీ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదలీల్లో భాగంగా ఈయన అమృతలూరు మండలం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. కొన్ని నెలలుగా చెరుకుపల్లి మండల పరిషత్తు ఇన్‌ఛార్జి అధికారుల పాలనలో ఉంది. నేటి నుంచి పల్లె పండగ జరగనున్న దృష్ట్యా పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలపై మహబూబ్ సుబానీ ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత

నిజాంపట్నం, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రతి వ్యక్తికి మానసిక ప్రశాంతత సమకూరుతుందని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బొర్రావారిపాలెంలో నూతనంగా నిర్మించిన వీరుళ్ల ఆలయ ప్రారంభోత్సవంలో సతీసమేతంగా పాల్గొని ఆయన పూజలు చేశారు.

ముందు జాగ్రత్తలు తీసుకోండి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: రానున్న మూడ్రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో ముంపు సమస్య తలెత్తకుండా రైతులు తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.బాలాజీగంగాధర్ కోరారు. మురుగు కాలువలకు అడ్డంకులేవైనా ఉంటే తొలగించుకోవాలన్నారు. మురుగునీటి పారుదలకు వీలుగా కాలువల్లో ఉండే కలుపు మొక్కలను తొలగించాలన్నారు. ప్రస్తుతం ఉన్న నీరు బయటకు పంపాలన్నారు. వానలు తగ్గే వరకు ఎరువులు, పురుగుమందుల వాడకం చేయరాదన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరకు ఆహ్వానం



కవి మల్లికార్జున

బాపట్ల, న్యూస్‌టుడే: శ్రీకళా వేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళాజాతర కార్యక్రమానికి బాపట్లకు చెందిన కవి అడుసుమల్లి మల్లికార్జునకు ఆహ్వానం అందింది. 24 గంటల పాటు ఏకధాటిగా నిర్వహించే ఉత్సవంలో పాల్గొనే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె పట్టణాన్ని వెంటాడుతున్న మురుగు సమస్య పరిష్కారానికి మున్సిపాలిటీ అధికారులు దృష్టిసారించారు. తెదేపా నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణాల్లో మురుగు సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రేపల్లె పురపాలిక సంఘానికి రూ.30 లక్షలు మంజూరు చేసింది. రేపల్లె-నిజాంపట్నం, ఉప్పూడి, అరవపల్లి, పెదమసీదు, రింగురోడ్డు ప్రాంతాల్లోని ప్రధాన మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో మురుగు కాల్వల్లో పూడికతీత పనులు సక్రమంగా చేయించక ఎక్కడికక్కడ పేరుకుపోయింది. దీంతో పట్టణంలో భారీ వర్షం కురిస్తే కాల్వల్లో మురుగు రహదారులపైకి చేరేది. బాటసారులు అసౌకర్యానికి గురయ్యేవారు. కూటమి ప్రభుత్వ పాలనలో మురుగు సమస్య పరిష్కారం కావడంతో పురవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ రోహిణి మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలో 6 కి.మీ పొడవునా కాల్వల్లో మురుగు పూడిక పనులు పూర్తయ్యాయన్నారు. భారీ వర్షం కురిసినా ఇబ్బంది లేదన్నారు.



కాల్వలో పూడిక తీస్తున్న కూలీలు

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

బస్‌షెల్టర్ ప్రారంభం


రిబ్బను కట్ చేస్తున్న నరసింహాచార్యులు

ధేనువకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: అద్దంకి మండలం ధేనువకొండకు చెందిన నలజల వెంకయ్య, నాగరాజు సహకారంతో ధేనువకొండ పునరావాస కాలనీ వద్ద బస్‌షెల్టర్ ఆవిర్భవించింది. రెండు నెలల క్రితం రూ.2.10 లక్షల వ్యయంతో దీని నిర్మాణానికి నాగరాజు భూమిపూజ చేశారు. 'శుభం' ఫౌండేషన్ సహకారంతో జన్మభూమికి సేవ చేయాలనే తలంపుతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ తండ్రి/ దివంగత సర్పంచి నలజల వెంకటేశ్వర్లు స్మారకార్థం ఇది నిర్మించినట్లు సోదరులు వెంకయ్య, నాగరాజు తెలిపారు. శనివారం దీన్ని గ్రామ పురోహితులు నారాయణం నరసింహాచార్యులు ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన విద్యార్థిని ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయాన్ని తమ తల్లి పర్వతవర్ధనమ్మ ద్వారా అందించారు. ఉపాధ్యాయుడు చప్పిడి కేశవరావు, తెదేపా నేతలు నాగినేని రామకృష్ణ, జొన్నలగడ్డ గోపీకృష్ణ, నలజల శ్రీనివాసరావు, బోడపాటి వెంకయ్య, నలజల అశోక్, అన్నాబత్తిన హరిబాబు, అణుబాబు తదితరులు పాల్గొన్నారు.

రద్దీగా బస్టాండులు


బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: దసరా సెలవులు అయిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు తిరిగి వెళ్లేందుకు ప్రయాణమయ్యారు. దీంతో బస్టాండ్‌లు రద్దీగా మారాయి. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని బస్టాండ్‌కు ఎక్కువ మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఆదివారం చేరుకున్నారు. బస్సులూ కిటకిటలాడాయి.

నర్రావారిపాలెంలో పోలీసుల పల్లెనిద్ర

అద్దంకి, న్యూస్‌టుడే: దక్షిణ అద్దంకి నర్రావారిపాలెంలో శనివారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్థానికులతో సీఐ పి.కృష్ణయ్య, ఎస్సై ఖాదర్ బాషా మాట్లాడారు. పట్టణంలో తరచూ చోరీలు జరుగుతున్నాయని, అపరిచిత వ్యక్తులు ఎవరైనా తారసపడితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. దొప్పలపూడి దుర్గాప్రసాద్, బిళ్లపాటి రామాంజనేయులు, నర్రా సుబ్బారావు, నర్రా రవీంద్రనాథ్, శివకృష్ణ పాల్గొన్నారు.

కడప దర్గా పీఠాధిపతి పర్యటన

మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి హరిఫుల్లా మాలిక్ పర్యటించారు. శని, ఆదివారాలు మార్టూరు, పూనూరు, పర్చూరు గ్రామాల్లో ఆయన పర్యటన సాగింది. హరిఫుల్లా మాలిక్‌ను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, ఆశీర్వచనాలు అందుకున్నారు.

మైదానం అస్తవ్యస్తం.. పార్కులో పనులు అసంపూర్ణం

చీరాల, న్యూస్‌టుడే

ఎన్ఆర్‌పీఎం మైదానం.. పట్టణం నడిబొడ్డున ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక మైదానం. నిత్యం ఉదయం, సాయంత్రం వందల సంఖ్యలో క్రీడాకారులు, నడకదారులు వస్తారు. ఇక్కడ గత పాలకుల వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం కొద్దిగా వర్షం పడిన నీరు నిలిచి చిత్తడిగా మారుతోంది. దీంతో సాధన ఆపేయాల్సిందే.

క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ వంటి క్రీడాకారులతో పాటు వివిధ ఉద్యోగాలకు వెళ్లేవారు పరుగు సాధన చేస్తుంటారు. వీరితో పాటు వందల సంఖ్యలో మహిళలు, పురుషులు నడకకు వస్తారు. అటువంటి మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వంలో దాదాపు రూ.10 లక్షలు ఖర్చుచేశారు. నాసిరకమైన కంకరతోపాటు లెవల్స్‌లో వ్యత్యాసం ఉండటంతో ఎత్తుపల్లాలుగా మారిపోయింది. తరువాత కొంత ఖర్చుచేసి ఇసుక పోశారు. అప్పుడూ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవటంతో పరిస్థితిలో మార్పురాలేదు. మైదానం మొత్తం రాళ్లు, గుంతలుగా తయారైంది. దీనికితోడు మైదానానికి వెనుకవైపు ఉన్న ఉద్యానవనాన్ని సుమారు రూ.90 లక్షలతో


నడకదారిలో నిలిచిన నీరు

అభివృద్ధి చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో పిల్లలు ఆడుకోవటానికి ఆట వస్తువులు, నడకదారులకు ప్రత్యేకంగా మైదానాన్ని, పార్కును కలుపుతూ వాకింగ్ ట్రాక్, ఏర్పాటు చేయాలని భావించారు. మొదట చేసిన పనులకు బిల్లులు సరిగా రాకపోవటంతో గుత్తేదారు కొన్ని పనులు మాత్రమే పూర్తిచేశారు. ఎన్నికలు సమీపించటంతో హడావిడిగా పార్కును ప్రారంభించారు. కానీ ఎక్కడి పనులు అక్కడే మిగిలిపోయాయి. దీంతో పార్కులో గందరగోళం ఏర్పడింది. వర్షపు జల్లులు పడిన ప్రతిసారి చిత్తడిగా మారిపోతుంది. ఒకవైపు మైదానం అస్తవ్యస్తం.. మరోవైపు పార్కులో అసంపూర్తి పనులు. దీంతో వాతావరణం అనుకూలంగా ఉంటే సరి లేదంటే చిత్తడే. ఈ పరిస్థితుల్లో ఇటీవల తరచూ కురుస్తున్న వర్షాలతో సాధన నిలిచిపోతుందని క్రీడాకారులు, నడకదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండే ఒకే మైదానం పరిస్థితి ఇంత దారుణంగా తయారైందని చెబుతున్నారు. ఇప్పటికైనా నూతన పాలకులు స్పందించి మైదానాన్ని సరిచేయటంతోపాటు పార్కులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


మైదానంలో నీరు

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి

గత ప్రభుత్వంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. అది పూర్తికాలేదు. ఏమాత్రం జల్లులు పడిన తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక మైదానం. దీన్ని పూర్తిగా అభివృద్ధి చేయాలి. అదేవిధంగా 12 అడుగుల వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. – పి.రామకృష్ణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

నీరు నిలవకుండా ఏర్పాట్లు చేస్తాం

త్వరలో వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.
– అబ్దుల్ రషీద్, కమిషనర్

కనుల పండువగా పార్వేట మహోత్సవం


పార్వేటలో దేవతామూర్తులు


గోమాతకు గ్రాసం తినిపిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా నిర్వహించే పార్వేట మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. చీరాలకే తలమానికమై కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాన్ని ఏటా మాదిరిగానే స్థానిక ఎన్ఆర్‌పీఎం మైదానంలో నిర్వహించారు. శరన్నవరాత్రులు సందర్భంగా పట్టణంలోని అన్ని దేవాలయాల్లో పూజలు అందుకున్న దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పండుగ రోజు ఒకే చోట చేరుస్తారు. ఒకేచోట కొలువుదీరిన స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలిరావటంతో మైదానం కిటకిటలాడింది. పురవీధుల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య దంపతులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. గోపూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక వారసత్వానికి పార్వేట ఉత్సవం నిదర్శనమన్నారు. ప్రజల్లో ఐకమత్యం పెంపొందించి ఆధ్యాత్మిక భావన కల్పించటంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు జమ్మి పూజలు నిర్వహించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చీరాల, న్యూస్‌టుడే: దసరాను పురస్కరించుకుని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దేవాంగపురి షిర్డీసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసంతర్పణలో పాల్గొన్నారు. నారాయణ వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకును ప్రారంభించారు. భవానీ థియేటర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.


అమ్మవారికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

దసరాకి కలుస్తారు.. సందడి చేస్తారు


పూర్వ విద్యార్థులు

వేటపాలెం, న్యూస్‌టుడే: బండ్ల బాపయ్య హిందూ ఉన్నత పాఠశాలలో వీరందరు 1985-86 సంవత్సరంలో పదోతరగతి వరకు చదువుకున్నారు. గడిచిన రెండేళ్లుగా దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నాగవరపమ్మ ఆలయం వద్ద కలుసుకుంటున్నారు. ఈ ఏడాది ఆదివారం అమ్మవారి గుడి వద్ద అందరు చేరుకుని, ఒకరినొకరి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. చదువుకునే రోజుల్లో పాఠశాలలో చేసిన అల్లరిని, ఆనాటి ఉపాధ్యాయుల గురించి ఒక్కసారి గుర్తు తెచ్చుకున్నారు. వచ్చే ఏడాది కుటుంబ సభ్యులతో కలవాలని, సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు కరణం మురళీకృష్ణ, చుండూరి రవీంద్రకుమార్, మల్లేశ్వరి, పెరుగు వెంకటేశ్వర్లు, పార్థసారథి, బిందుసాగర్, గట్టా రమేష్, మధుసూదనరావు, శాస్త్రి ఉన్నారు.

16న పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

యద్దనపూడి, న్యూస్‌టుడే: మండల కేంద్రం యద్దనపూడిలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి విగ్రహ, ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 14 నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయని భక్తులు తరలిరావాలని కోరారు.

ప్రపంచంలోనే డిజిటలైజేషన్‌లో అగ్రస్థానం


వినికిడి యంత్రాలు అందిస్తున్న చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్

అద్దంకి, న్యూస్‌టుడే: డిజిటలైజేషన్ విధానంలో ప్రపంచంలోనే భారతదేశం అగ్రభాగాన నిలిచిందని చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి యంత్రాల పంపిణీ స్థానికంగా నిర్వహించారు. సభకు భాజపా నేత రేగుల రామాంజనేయులు అధ్యక్షత వహించారు. అనంతరం వినికిడిలోపంతో బాధపడుతున్న 50 మందికి యంత్రాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మీరావలి, కొండముది బంగారుబాబు, మన్నె సుబ్బారావు, సందిరెడ్డి రమేష్, యల్లమందరావు, పీఎల్ఎన్.ప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు, పరుచూరి శ్రీనివాసరావు, కాలేషావలి, సుబ్రహ్మణ్యం, పిన్నిటి శ్రీదేవి-గోపీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏల్చూరులో మంత్రి పర్యటన

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం సంతమాగులూరు మండలంలో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఏల్చూరులో ఉదయం పది గంటలకు జరుగనున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్లు పేర్కొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరింది.

వైభవంగా విజయదశమి వేడుకలు


చీరాల పాపరాజుతోటలో అలంకరణలో సాయిబాబా


ఈపూరుపాలెంలో జలబిందెల ఊరేగింపు


వేటపాలెం గ్రంథాలయం వీధిలో బతుకమ్మలతో..


ఇంకొల్లులో వాసవీ మాత నగరోత్సవం


అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజలో సీఐ కృష్ణయ్య


చింతగుంపల ఆలయంలో..


గోవాడలో ఆవిష్కరించిన కార్యసిద్ధి అభయాంజనేయస్వామి విగ్రహం


అద్దంకి: బంగారుచీరలో వాసవీ కన్యకాపరమేశ్వరి

చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో విజయదశమి వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించారు. శనివారం చివరి రోజు అమ్మవారు వివిధ ఆలయాల్లో రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమివ్వగా పలు చోట్ల దేవతా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అద్దంకిలో వాసవీ కన్యకాపరమేశ్వరి మాతను బంగారు చీరతో అలంకరించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పూజలకు అత్యధిక సంఖ్యలో వాహనదారులు తరలిరావడంతో ఆలయాల వద్ద వాహనాలు బారులుతీరాయి. పోలీసు స్టేషన్లలో నిర్వహించిన ఆయుధ పూజ నిర్వహించారు. జమ్మిచెట్టు వద్ద జరిగిన పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం స్వామివారు, అమ్మవార్లకు గ్రామోత్సవాలు నిర్వహించారు. అద్దంకి మండలం గోవాడలో దాత పావులూరి నాగేశ్వరరావు దంపతులు సమకూర్చిన 27 అడుగుల కార్యసిద్ధి అభయాంజనేయస్వామి విగ్రహాన్ని, గ్రామస్థుల విరాళాలతో కోదండరామ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన జీవధ్వజ స్తంభాన్ని ఆవిష్కరించారు.
-న్యూస్‌టుడే బృందం


కారంచేడు శ్రీ వైష్ణవి దుర్గామాత


మేదరమెట్లలో..


రాజరాజేశ్వరిదేవిగా నాగరాజుపల్లి పార్వతీ దేవి


మార్టూరు మండలం వలపర్లలో..


పర్చూరు వాసవీ అమ్మవారి ఆలయంలో ఎంపీ కృష్ణప్రసాద్ పూజలు

సముద్రంలోకి వేటకు వెళ్లొద్దు

పల్లెపాలెం, కాటంవారిపాలెం (చినగంజాం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ఉన్న నేపథ్యంలో రానున్న నాలుగు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని, అందువల్ల మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఉప్పలపాటి శ్రీనివాసరావు సూచించారు. పల్లెపాలెం, కాటంవారిపాలెం, కోడూరివారిపాలెం, ఏటిమొగ తదితర తీర ప్రాంతాలను ఆయన ఆదివారం సందర్శించారు. ఆయా గ్రామాల్లోని మత్స్యకారులతో మాట్లాడారు. ఈ పాటికే వేటకు ఎవరైనా వెళ్లి ఉంటే వారిని ఇళ్లకు పిలిపించుకోవాలని చెప్పారు. వీఆర్వోలు పద్మ, శ్రీదేవి, వీఆర్ఏ అనిల్ పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

అద్దంకి, జే పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లో పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవోలు బి.సింగయ్య, స్వరూపరాణి, కుసుమకుమారి వెల్లడించారు. అద్దంకి మండలం గోవాడ, చిన్న కొత్తపల్లి, శింగరకొండపాలెం; జే పంగులూరు మండలం నూజెళ్లపల్లి, చందలూరు, తూర్పుతక్కెళ్లపాడు, తూర్పుకొప్పెరపాడు; బల్లికురవ మండలం వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

యద్దనపూడి, కారంచేడు, న్యూస్‌టుడే: 'పల్లె పండుగ' వివిధ గ్రామాల్లో 14న నిర్వహిస్తున్నట్లు యద్దనపూడి, కారంచేడు ఎంపీడీవోలు మహ్మద్ అకీబ్ జావీద్, నేతాజీ తెలిపారు. సోమవారం ఆయా మండలాల్లోని వింజనంపాడు, శామలవారిపాలెం, జరుగులవారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నారని వారు వెల్లడించారు.

వాసవీ క్లబ్‌ల ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా గాయత్రి


నియామకపత్రం అందుకుంటున్న గాయత్రి

వేటపాలెం, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్‌ల ఇంటర్నేషనల్ వి205ఏ జిల్లా గవర్నర్‌గా వేటపాలేనికి చెందిన చుండూరి గాయత్రి ఎంపికయ్యారు. ఒంగోలు శిద్దా సూర్యప్రకాశరావు కార్యాలయంలో ఎన్నికల అధికారి కనమర్లపూడి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఇది నిర్వహించారు. జిల్లా ఐఈఎస్ ఆఫీసర్లు గార్లపాటి బ్రహ్మానందం, కూనాల సుదర్శన్, అమరా వెంకట సుబ్బారావు, ఊటుకూరి బాల వెంకట సత్యనారాయణ, వల్లంపట్ల మురళీకృష్ణమూర్తి, ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, ప్రస్తుత గవర్నర్ పేర్ల వెంకట సత్యనారాయణ, శనగపల్లి వెంకట కృష్ణమోహనరావు అభినందించారు.

క్షతగాత్రుడిపై ఎస్సై మానవత్వం


యువకుడికి సపర్యలు చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి సపర్యలు చేసి ఎస్సై మానవత్వం చాటుకున్నారు. ఈఘటన వేటపాలెంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది.. వేటపాలెం నుంచి కుందేరుకు వెళ్లే రోడ్డులో వినాయక స్వామి ఆలయం వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడు అదుపు తప్పి, కింద పడటంతో తలకు గాయమైంది. ఆ వెనుక వస్తున్న ఆటో ఇతనిపైకి ఎక్కింది. ఈ విషయాన్ని స్థానికులు చరవాణి ద్వారా ఎస్సై మీసాల వెంకటేశ్వర్లుకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడి తల నుంచి ఒక పక్క రక్తం కారడంతో పాటు తలకు మట్టి అయ్యింది. దీంతో ఎస్సై నీటితో అతని ముఖం తుడిచి, రక్తం కారకుండా గుడ్డతో కట్టుకట్టారు. 108 వాహనం రావడంతో అందులో ఎక్కించి, చీరాల తరలించారు.

కృష్ణా నదిలో యువకుడి గల్లంతు

విజయవాడ: స్నేహితులతో కలిసి కృష్ణా నదిలో స్నానానికి దిగిన యువకుడు గల్లంతైన ఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అవనిగడ్డ ప్రాంతంలోని కొత్తపాలెంకు చెందిన రేపల్లె రాజు (20), మేదరమెట్లకు చెందిన పోతినేని కేశవనారాయణ(21), నెల్లూరుకు చెందిన వెక్కల విష్ణువర్ధన్(21) విజయవాడ లబ్బీపేట పైడయ్య వీధిలోని బాయ్స్ హాస్టల్ ఉంటూ సీఏ చదువుతున్నారు. కృష్ణా నదిలో స్నానం చేద్దామన్న నిర్ణయానికి వచ్చిన ముగ్గురూ ఆదివారం సాయంత్రం కృష్ణలంక స్వర్గపురి సమీపంలో నదిలోకి వెళ్లారు. రాజా, విష్ణువర్ధన్ నీటిలో దిగారు. కేశవనారాయణ మాత్రం ఒడ్డునే ఉండి ఫోన్ మాట్లాడుతున్నాడు. కొద్దిసేపటికి విష్ణువర్ధన్ నీటిలో మునుగుతూ కేకలు వేయగా.. సమీపంలోని జాలరులు అప్రమత్తమై అతడిని బయటకు తీశారు. రాజు కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందితో కృష్ణలంక పోలీసులు నదిలో గాలించారు. చీకటి పడటంతో రాజు ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

ఒంగోలు నేరవిభాగం: గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. చీరాలకు చెందిన మధు, మరో ఇద్దరు వ్యక్తులు గంజాయితో సంచరిస్తుండగా పట్టుకున్నారు. వారినుంచి 1.40కిలోలతోపాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.